# అపోహ

## శ్రీ కొనకళ్ళ వేంకటరత్నం

మారిస్ మైనర్ దిగీ దిగగానే ఒక్క గంతులో ఇంట్లో అడుగుపెట్టాడు ఎడ్వకేట్ రాజేంద్రుడు. హాలులోనించీ గబగబ మెట్లెక్కి మేడగదిలో టేబిలుప్రక్కని స్టూలుమీద సూట్‌కేసు పెడుతూనే 'రమా' అని కేకవేశాడు. రమ కిందహాలులో కనపడ లేదు. పైన గదిలో ఉంటుంది అనుకొని సరాసరి మేడ మీద గదిలోకి వచ్చేశాడు. అక్కడా లేదు. టకటకమన్న బూట్లచప్పుడు విని హాలులో మేడ మెట్లదగ్గర కునికిపాట్లు పడుతున్న నవుకరు సింహాద్రి ఉలిక్కిపడి లేచి, పైకి దవుడుతీసి, చకచక అయ్యగారి కోటందుకొని, హ్యాంగర్ మీద అమర్చాడు; షర్టూ, బనీనూ గుమ్మిలో పారేశాడు; బూటు లేసులు విప్పేందుకు ఉపక్రమించాడు.

ఈ కార్యక్రమ మంతా రమాదేవి వంతు; ఈ పనులేవీ మరొకళ్ళని చెయ్యనివ్వ దావిడ. రాగానే ఆమె కనపడకపోతే అతని కదోలా వుంటుంది. చుట్టూ కలయజూచాడు. సాయంకాలపు నీరెండ కిటికీ ఊచలలో నించీ దూసుకొచ్చి పడుతోంది. గాజుతొట్టెలో 'హవాయీ' బంగారపు రంగు చేపలు నాచులో దాగుడుమూచ్చిలాడుకుంటున్నాయి, తమ కేమీ పట్టనట్టు. కిటికీ లోపలికి తొంగిచూస్తున్న కాశీరత్నాలు రమాదేవి ఎక్కడికి వెళ్లిందీ చెప్పవు.

వంటమనిషి రవణమ్మ వచ్చింది పైకి. ప్రశ్నార్థకంగా చూశా డతను. "అమ్మగారు గుళ్లోకి వెళ్ళారు" అని చెప్పింది. దానితో షుమారుగా చిట్లించిన మొహం కాస్త సద్దుకుంది. "ఎంతసేపయిందీ?" అన్నాడు బూట్లు విడుస్తూ. "చాలాసేపయింది. ఈపాటికి వచ్చేస్తూవుంటారు బహుశా." అన్నది. "స్నానం చేస్తారా?" అని తువాలందించింది రవణమ్మ. అది చుట్టబెట్టుకొని, టర్కీ తువాలు బుజాన వేసుకొని, మేడ గది వెనకాతల వున్న బాత్ రూమ్‌లోకి వెళ్లాడు. వేడినీళ్ళ 'షవర్' ఒంటిమీద పడగానే ప్రయాణపు బడలిక సన్నగా దిగజారిపోతున్నట్టుం దతనికి. 'జాస్మిన్' సబ్బు నురగలు తెరలు తెరలుగా క్రిందికి జారుతున్న కొద్దీ అతని ఒంటి జిగీ బయటపడుతోంది. తృప్తిగా చూచుకొంటూ కూనిరాగాలు తీస్తున్నాడు.

రాజేంద్రుడు పెద్ద రూపసికాడు. కాని హుందా గల విగ్రహ మతనిది. ఒంటి చాయ ఎరుపులోకి మొగ్గు చూపే చామన చాయయినా, తీరైన రూపురేఖలు మటుకు రంగు భలానా అని ఆరా తీసుకోనియ్యవు. విశాలమైన నుదురూ, కోసాకూ సన్నని చిన్న కెరటాలుగా పెంకెగా సాగిపోతూ, నిత్యమూ లవండర్ సువాసనలతో మెరిసిపోయే క్రాపూ, ఎంత ఖర్చయినా తట్టుకోగల యవ్వనపు నైశిత్యం బుడగలేసే బుగ్గలూ, బలిష్ఠమైన మెడా, అట్లా నాజూకుగా మంగలి నేర్పుగా కత్తిరించిన తీరా, లేకపోతే సాతహానే అట్లా మొలిచినయ్యా, అనిపించే సున్నితమైన 'తల్వార్ కటింగ్' మీసకట్టూ...ఏతావాతా, కొత్తగా యౌవనంలో అడుగుపెట్టిన ఆడపిల్లలు, తారసిల్లగానే, ఒక్కసారి తళుక్కుమని చూచిగాని వదిలిపెట్టని మూర్తి అతనిది. రమ మటుకు మెరుపుతీగలా ఉంటుంది. ఒకొక్కనాడు ఉన్నట్టుండి కిటికీ తలుపులు గభాల్న మూసి రమని గట్టిగా కావిలించుకుని "మబ్బుల్లో మెరుపుతీగ!" అంటూ అతను ఒక సుదీర్ఘమైన ముద్దు పెట్టుకోవడమూ, ఆమె గబగబా విడిపించుకొంటుంటే అతను అర్థంకానట్టు తెల్లబోతూ చూడడమూ, "మబ్బుల్లో మెరపుతీగ ఎంతసేపుంటుందీ?" అని, ఆమె అందకుండా తుర్రుమని మేడమెట్లు ఘల్లు ఘల్లున దిగిపోవడమూ పరిపాటి.

రాజేంద్రుడు అంత బలంగా అవుపించినా, అతి సుకుమారమైన అలవాట్లతనివి. శరీరం ఏ టెన్నిస్‌లోనో నలుగుడు పడాలిసిందే తప్ప, ఇంట్లో మటుకు చిన్న మెత్తు పని కలిపించుకోనే స్వభావం కాదతనిది. లుంగీ ఎక్కడవిడిస్తే అక్కడ లుంగచుట్టుకొని పడిపోవలిసిందే. దాన్ని తీసి పిడచవలసిన 'డ్యూటీ' మరొకళ్లది. సబ్బు రుద్దుకోవడంమటుకే అతని పని. దానిని సకాలంలో తీసి బాత్ రూమ్‌లో ఆ కార్నర్ స్టాండుమీద బెనారస్ 'సంగమర్మన్' సోప్ బాక్సులో పొందికగా

అమర్చిపెట్టవలసిన పనిమాత్రం అతనిది కాదు. కోటు గుండీలు తీయడంవరకే అతని పని. దానిని తక్షణం అందుకొని 'వార్డ్‌రోబ్' మీద నిర్దిష్టమైన చోటికి దానిని చేర్చే ఘనకార్యం మరొకరిది. వచ్చిన ఉత్తరం చదివి, చించిన ఖాళీ కవరు అవతల పారేయడం మటుకే అతని పని. దానిని తక్షణం ఏరి, టేబిలుక్రింద చెత్తకాయితాల బుట్టలో పడేయవలసిన బాధ్యత అతనిది కాదు. మళ్ళీ గలీజు జరిగిన మరుక్షణంలో అంతా సుబ్భరంగా, నీటుగా, ఉండాలి—అంటే, ఇది ఫలానావారి పని, అది ఫలానావారి పని, అని అతను పనిగట్టుకొని నియమించడు. కాని దైనందిన కార్యకలాపాలలో ఆ ఏర్పాటు స్థిరపడిపోయి ఉంటుంది. ఆ పరిశుభ్రమైన, నిర్ణీతమైన కట్టుబాటులో ఎక్కడైనా, ఏమాత్రమైనా, పొరపాటుగాని, అజాగ్రత్తగాని, పొడసూపిందా, ఒక తీక్ష్ణమైన చిరాకు చూపుతోనో, మొహాన క్షణమాత్రం ఆవరించిన ఒక సన్నని చిట్లింపుతోనో అది సర్దుకుపోవాలిసిందే. అంతకు మినహా కించిత్పరుషంగానైనా మాట్లాడి ఎరగడతను. అతను రవంత అస్తిమితంగా ఇబ్బందిగా అవుపిస్తే చాలు ఎక్కడో, ఏ టాయిలెట్ అరేంజిమెంటులోనో, ఏ కాయితాల సర్దుబాటులోనో, ఒక్క పిసరు రైలు పట్టా తప్పివుంటుంది, అని దాఖలా.

రాజేంద్రుడూ, రమాదేవీ ఇటీవల కొత్తగా ఒకళ్ల మనసుల్ని ఒకళ్లు ఆదరా బాదరా ఆక్రమించుకొని కూచున్న గువ్వపిట్టలు. రమకి ఇంగ్లీషు చదివినసంస్కారం తక్కువ. కాని పనిపాటలలో మెలితిరిగిన చెయ్యి. వచ్చీ రాగానే ఈ సుందర సుకుమారుడైన తన భర్తగారి అభిరుచులూ, అలవాట్లూ గబగబ తన అజమాయిషీలోకి తెచ్చేసుకొన్నది. సూక్ష్మగ్రాహి, మితభాషి అయిన భర్తకి ఎక్కడ ఎప్పుడు ఏమికావాలో, అతను అడగకుండా, ఒకళ్లు చెప్పకుండా, అనాయాసంగా, అప్రయత్నంగా గ్రహింపుకు తెచ్చుకోగల కుశాగ్రబుద్ధి.

ఇంటిదగ్గర ఉన్నంతసేపూ అతనిచుట్టూ చుట్టూ తిరుగుతుంది. కింద హాలులో అతని ఆఫీసు. అక్కడ ఆ 'రాకింగు చెయిరు'లో కూచున్నాడా, తన పరిధి అతను దాటిపోయినట్టు లెఖ్ఖ.

కోర్టుకి వెళ్లేముందు అతని ముస్తాబు మటుకు ఆమె చేతిమీదుగా జరగవలసిందే. దంతపు దువ్వెన తుడిచి, పాపిడితీసి రేగినజుత్తు అలా అలా వేళ్ళతో సుతారంగా సద్ది, "అదుగో కదుల్తున్నారు" అన్న బుల్లి బుల్లి ఆదలింపులతో, అదో కళగా దిద్దితీర్చి, ఆఖర్న అటునించి ఒక దఫా, ఇటునుంచి ఒక దఫా, అందాలు తూకం వేస్తున్నట్టు పరకాయించి చూచి, "కరెక్ట్" అని గాని వదిలిపెట్టదు. ఆ తంతు ఎవడైనాచూస్తే ఒక భార్యారత్నం తన భర్తగారికి తల దువ్వుతోందా, లేకపోతే, ఒక చిత్రకారుడు కుంచెపుచ్చుకొని కేన్వాస్ మీద రేఖలు దిద్దుతున్నాడా, అన్న మీమాంస ఓపట్టాన వదలదు. ముస్తాబంతా అయింతరువాత, అతను కిందకి దిగి వెడుతుంటే, 'కీ' యిచ్చి వదిలిన ప్లాస్టిక్ బొమ్మవంక మిడుతూ మిడుతూ చూచే బేబీలాగ, అతను మలుపు తిరిగేదాకా అలవోకగా, డాబా పిట్టగోడ ఆనుకొని, అట్లాగే చూస్తూ ఉండిపోతుందా ఇల్లాలు.

సంసారం సాగరమే కావచ్చు కాని, వాళ్ళిద్దరికీ ప్రస్తుతం ఒక నిస్తరంగ సముద్ర ప్రయాణం.

ఆ పూలడింగీకి ఒక చిన్న కుదుపొచ్చి పడింది. రాజేంద్రుడు స్నానం ముగించి కిందహాలులో ముఖ్యమైన 'కేసు ఫైలొ'కటి ముందేసుకుని కూచున్నాడు. రవణమ్మ వెనకాతల ఓరగా వేసివున్న తలుపుదగ్గర నుంచుని ఓ చిన్న దగ్గు దగ్గింది. చెప్పవలసిన దేమైనా ఉన్నప్పుడు అదొక సిగ్నల్. "ఇవాళ ఒక పెద్ద విపరీతం జరిగింది బాబూ మన ఇంట్లో." అన్న దామె గుటకలు మింగుతూ.

"విపరీతమా?" ఫైలు విప్పుతున్నవాడల్లా చట్టన ఆగిపోయాడు రాజేంద్రుడు.

"మరి అమ్మగారు గుళ్ళోకి వెళ్ళారన్నావు?"

ఆమె చిన్నగా నవ్వింది.

"అమ్మగారు క్షేమంగానే వున్నారు లెండి. మరేమీ గాబరాపడవద్దు." అని, "ఇవాళ ఉదయం అమ్మగారు కింద పెరటిగదిలో మామూలుగానే స్నానం చేశారు. పైన గదిలో 'టాయిలెట్టు కేసు' తెరిచి స్నో రాసుకుని డిసెంబర్‌పూల కదంబం వేలుముడిలో తురుముకొన్నారు. రవ్వల నెక్‌లెస్ మెడలో వేసుకొని ధర్మవరం పట్టుచీర కట్టుకున్నారు. వెండి పూలసజ్జలో మన పెరట్లో పుణికిన ముద్దమందారాలూ, విష్ణుక్రాంతాలూ, శంఖుపుష్పాలూ పేర్చుకుని జనార్దనస్వామి కోవెలకి ధనుర్మాసం కదా వెడదామని మెట్లు దిగబోతున్నారట. మరి ఎప్పుడు, ఎలా జొరబడ్డాడో, అమ్మగారు పైకి వెళ్ళకక్రితమే, హాలులో మెట్లచాటున మాటేసుకొని కూచున్నాడల్లే

వుంది, ముందస్తుగానే మేడ గదిలో ఎక్కడ నక్కివున్నాడో మరి—ఒక గజదొంగట—వెనకాలే గభాల్న వచ్చి ఒక చేతితో పీక అదిమిపట్టి రెండోచేత్తో ఒక కండువా అమ్మగారికళ్ళకి గంతలుకట్టి—రెండుముడులు వేశాడట... మెడలోవున్న నెక్ లెస్ తెంపుకుని, అమ్మగారిని మెట్లకిందకి తోసేసి మేడమీదనించీ ఎట్లా తప్పించుకుపొయ్యాడో, క్షణంలో తప్పించుకొని పారిపొయ్యాడటండీ. మెట్లకింద కెవ్వుమన్న కేక విని నేనూ, సింహాద్రీ ఆదరా బాదరా వచ్చేసరికి అమ్మగారికి స్పృహ లేదంటే నమ్మండి. ఆపళంగా అమ్మగార్ని దబదబా స్ప్రింగు మంచంమీదికి చేర్చి డాక్టరుకి కబురంపితే, వచ్చాడు. వచ్చి పరీక్షచేస్తే, ఒంటిని గాయాలేమీ లేవు. ఎందుకైనా మంచిదని ఓ ఇంజక్షనిచ్చాడు. ఆపైన తెప్పరిల్లి జరిగిందంతా సూక్ష్మంగా చెపితే నలుగురూ నాలుగు మూలలా వెతికారు దొంగకోసరం. కాని పత్తాలేదు. ప్రొద్దున్న మన ఇల్లంతా తిరణాలయిపోయిందంటే నమ్మండి బాబుగారూ. పోలీసులు వచ్చిపడ్డారు....నానా హంగామా చేశారు. 'ఎట్లా వచ్చాడు? ఎట్లా పారిపొయ్యాడు?' అని గుచ్చి గుచ్చి ప్రశ్నలువేసి, వాఙ్మూలాలూ, వివరాల పట్టీలు, తీసుకుని ప్రాణాలుతీసి చక్కాబోయారు. ఇంతవరకూ ఏమీ ఆచూకీ చిక్కలేదు." అని మధ్య మధ్య కళ్ళు పెద్దవిచేస్తూ కథ ముగించింది.

ఎంత సాహసం! పట్టపగలు! రాజేంద్రుడు ఆశ్చర్యంలో మునిగిపోయాడు; ఫౌన్ టెన్ పెన్ క్యాప్‌తో పెదిమలమీద తాళంవేసుకుంటూ, ఇంకా వింటూవున్న వాడికిమల్లేనే ఆలోచనలో పడ్డాడు.

అంతలో రమ తిరిగి రానేవచ్చింది.

వస్తూనే మేడమెట్లెక్కి పోతోంది. "ఎప్పుడు వచ్చారు?" అని తనని అడగనైనాలేదు. సరాసరి మేడ మెట్లు ఎక్కుతోంది హాలులోనించీ. ఆమె వెడుతూంటే అట్లాగే చూస్తో కూచున్నాడు. అర్థంకాని ఖంగారేపడ్డాడు కొంత. ఆమె వెనకాలే, ఆమె ననుసరించి, ఒక్కొక్క మెట్టే ఎక్కి పైకి వెళ్లాడు. ఆమె మూగవతుగా నిలబడిపోయింది. దగ్గరసా వెళ్ళి ఆమె చిబుకం మునివేళ్ళతో పైకెత్తి "ఏమిటి? ఒంట్లో బావుండలేదా?" అని కళ్ళల్లోకి చూచాడు రాజేన్. కళ్ళనీళ్ళ పర్యంతం అయిందామె. ఆ బేలతనానికి కొంత చలించి "ఛా - అంతా విన్నానులే - పోతే పోయింది. రెండువేలు చేస్తుందనా వెధవ నెక్ లెస్ - దాని కింత గాబరాపడిపోతావేమిటి?" అని నడుము చుట్టూ చేయి మెలివేశాడతను. దానితో కొంత కుదుటపడినట్టు అనిపించింది.

రాత్రి వెన్నెట్లో మేడగదికి ఇవతల పిట్టగోడ కానుకుని నిలుచున్నారిద్దరూను. రిక్షాలూ జట్కాలూ రణగొణ ధ్వని చేస్తున్నాయి. కోవెలలోనించీ గంటలు వినిపిస్తున్నాయి. పార్కులోనించీ రేడియో పాటలు గింగురుమంటున్నాయి. ఏమయినా చెబుతుందనుకుని మౌనంగా ఎదురుచూస్తో నిలుచున్నాడు రాజేన్. ఆ నీరవ నిశ్శబ్ద భావం దుర్భరమే అయిందతనికి. మెట్లకి రవంత ఎడంగా పిట్టగోడని రాసుకుంటూ ఎదిగిన ఒక సీమ బాదంచెట్టు తన చిటారు కొమ్మలతో మేడ గది మీదకి పడగెత్తి నుంచున్నది. చటుక్కున స్ఫురించిందతనికి. "మేడమీదనించీ ఇట్లా ఈ బాదంచెట్టు దిగువకి చరచరా దిగి పారిపోయివుంటాడు బహుశా." అని కదిలించాడామెని. "అంతే జరిగివుండాలి మరి." అన్నదామె అయోమయంగా. జడ పట్టుకుని చమత్కారంగా గుంజి "ఓసి లేడిపిల్లా, అట్లా వణికిపోతావేమిటి?" అని గబగబ దొరకబుచ్చుకుని గభీమని తలుపు వేశాడు రాజేన్.

రాత్రంతా రమ కలవరించింది.

ప్రొద్దున్న ఎనిమిదయింది. రామయ్యపంతులింకా రాలేదేమా అని చూస్తున్నాడు రాజేన్.

రామయ్యపంతులు మొదటినించీ అతని దగ్గర గుమాస్తా. రాజేంద్రుని తండ్రి రాజారాంగారు బార్‌లో పేరుపొందిన వకీలు. ఆయన దగ్గర ఆదినించీ తర్ఫీదైన గుమాస్తా రామయ్యపంతులు. ఆయన అనంతరం, రాజేంద్రుడి దగ్గర ఉంటూవచ్చాడు. కోర్టు వ్యవహారాలన్నీ కొట్టినపిండి ఆయనకి. రాజేంద్రుడి ఇంట్లో ఒక ప్లీడరు గుమాస్తాగా మాత్రమే కాక, ఆ యింట్లో అన్నిటికీ అండ దండగా ఉంటూ వచ్చాడాయన. ఇంట్లోకి వచ్చిన కొత్త బీరువా ఎక్కడ వుంచాలీ అన్నా, టేబిలుమీద ఏ ఫైళ్లు ఎక్కడ అమర్చాలీఅన్నా, సీలింగు ఫాన్ ఎంత దిగువగా వుంటే నిరపాయంగానూ, సదుపాయంగానూ ఉంటుందీ అన్నది నిర్ణయించవలసి వచ్చినా, రోగాలకీ, రొచ్చులకీ ఏ డాక్టరుని పిల్చుకురావాలన్నా, పెద్ద పెద్ద కోర్టు వ్యవహారాలు పరిష్కరించవలసి వచ్చినా, కొసకి ఒక కేసు పట్టాలా కూడదా అన్నది తేల్చుకోవలసివున్నా ఆయన సలహా సంప్రదింపులు లేకుండా క్షణం గడవదా ఇంట్లో. ఆయనంటే

ఇంటిల్లిపాదికీ.ఒక విలువా, ఒక గౌరవమూ ఉన్నాయి. అంచేత "ఏమోయ్" అని మామూలుగా పిలిపించుకునే అలవాటు లేదాయనకి. "పంతులుగారూ" అని రాజేంద్రుడూ, "బాబాయీ" అని రమాదేవీ మన్ననగా పిలుస్తుంటారాయనని. అట్లా అట్లా ఆ యింటికి ఒక పెద్ద తలకాయిగా, ఒక హితైషిగా, స్థిరపడిపోయాడు రామయ్యపంతులు. తదనుగుణంగానే, వారిద్దరిమధ్యా మర్యాదగా, కాలక్షేపంచేస్తూ పెత్తందారీ వెలిగించాలనే ధోరణిలో కాక, మంచి సెబ్బరలు బాధ్యతతో ఆలోచించి, నచ్చచెప్పి మరీ చేయించగల స్తిమితమూ, శాక్యమూ, దక్షతా కలవాడని పేరాయనకి.

పుష్టిగా బొద్దుగా ఉంటాడు. ఎప్పుడూ ఖద్దరు వేస్తాడు. గాంధీగారి ఉద్యమంలో కొంత చేయిగాల్చుకొన్నాడు. కాని సంసార భారానికి తట్టుకోలేక వెనక్కి దిగబడిపోయాడు. అక్రమాలకి ఒడిగట్టనివాడనీ, నిజాయితీకి నిలబడగలవాడనీ, ఇరుగునా పొరుగునా మాత్రమే కాదు, కోర్టు వాతావరణంలో కూడా పలుకుబడి కలవాడు. తల సగం పండింది. మాటగాని, నడకగాని, అతి నెమ్మది. వ్యవహారంలోమటుకు అతి చురుకు. నుదుటిమీద గట్టిగా పేనిన త్రాళ్ళల్లే ముడతలూ, ఆ ముడతలమధ్యని లైను తప్పనితెల్లని చక్కని విభూతి పెండేకట్లూ ఆయన కర్మిష్ఠుడని చెప్పక చెబుతాయి. కచ్చితంగా మాట్లాడుతున్నాడో, కోపంగా ఉగ్గడిస్తున్నాడో, సలహాయిస్తున్నాడో, ఆజ్ఞలు పెడుతున్నాడో గిరిగీసి చెప్పడం అసాధ్యమైనపని.

వస్తూనే, "ఎప్పుడువచ్చారు తెనాలినించీ?" అని పలకరించి క్షణమాత్రం టేబిలుముందు నిలబడి "విన్నారుగా?" అని పరామర్శించాడు. కాయితాలు చూచుకొంటూనే తల ఊపాడు రాజేంద్రుడు. పంతులు ముసిముసిగా నవ్వుకొంటూ సులోచనాలు ధోవతి కొంగున తుడుస్తూ తన డస్కుపెట్టెదగ్గర చతికిలపడుతూ, "మన నెక్‌లెస్ దొరికింది స్మండీ! పోలీసుస్టేషన్లో వున్నది." అని చక్కా ఊరుకున్నాడు. వ్రాసుకుంటున్నవాడల్లా పేనా ఆపుచేసి "మన నెక్‌లెస్సా? దొరికిందా? అప్పుడే? తమాషాగా వున్నదే!" అని నిశ్చేష్టుడైనాడు రాజేంద్రుడు. ఫౌన్ టెన్ పెన్ చప్పున హోల్డర్‌లో ఉంచి 'రమా రమా' అని అరుచుకొంటూ మేడమీదకి వెళ్లాడు. అప్పుడే స్నానమయిందో ఏమో, పాడిచీర చుట్టబెట్టుకొని, ఆదరా బాదరా బైటికి వచ్చింది రమాదేవి. రెట్టించిన ఉత్సాహంలో కేకేసి చెబుతున్నాడు రాజేంద్రుడు. వినగానే మొగమింత అవుతుందని అతని ఆశ. స్త్రీకి ఆభరణమంటే ఒంట్లో ఒక భాగంకింద లెఖ్ఖ అని అతనికి ఒక గట్టి నమ్మకం. కాని, విచిత్ర మేమిటంటే, ఆమె మొహం వికసించనే లేదు, సరిగదా అద్దంవంక చూస్తూ అలాగే నిశ్చలంగా నిలబడిపోయింది. ఆమె తత్వమే అంత. పైగా "ఎక్కడ దొరికిందీ?" అని యదాలాభంగా అడుగుతున్నది. రాజేంద్రుడికి ఆశాభంగంతోపాటు విసుగూ పుట్టుకొచ్చినై. "ఎక్కడో ఒకచోట దొరికింది. పోలీస్ స్టేషన్లో ఉన్నదట, పంతులుగారు కబురుతెచ్చారు. రా-రా" అని, ఒక్క గుక్కలో ఏకరువుపెట్టి, మేడమెట్లు గబగబ దిగుతున్నాడు. వెనకాతలనించీ రమ "ఎక్కడ దొరికిందీ?" "ఎవరిదగ్గర దొరికిందీ?" అని గుచ్చి గుచ్చి ప్రశ్నలు వేస్తూనే దిగింది. పంతులప్పుడే స్తిమితంగా గుండుగొల్లురాజుల కేసులో వకాల్తానామా డ్రాఫ్టు చేస్తున్నాడు. ఇద్దరూ ఆయన్ని జాయింటుగా ముట్టడించారు. ఆయన కొంచెం సీరియస్‌గా మొహంపెట్టి డస్కుపెట్టెలో పాత ఫైళ్ళకోసం వెతుకుతూ "అదే ఆలోచిస్తున్నా - అతనిదగ్గర కెట్లా వచ్చిందా అని?" మెదలకుండా ఊరుకున్నాడు. ఊపిరి బిగబట్టి విన్నారిద్దరూ.

"మన నందకిశోర్ దగ్గర పట్టుపడిందట నెక్‌లెస్సు. ఇవాళ ఉదయమే షరాబు కోటిలింగం దగ్గర అమ్మకానికి పట్టుకొచ్చాడట."—రమాదేవి ముఖం కళ తప్పింది—రాజేంద్రుడు నేలచూపులు చూస్తూ నిల్చుండిపోయాడు. అంతలో రమ తేరుకొని

"ఏమంటున్నా డతను?" అని ప్రశ్నించింది.

"అది తనదేనని నిష్కర్షగా చెబుతున్నాడు."

కోటూ కారూ వేసుకొని రాజేంద్రుడు తిన్నగా పోలీసు స్టేషనుకి వెళ్ళాడు.

"అది ఎట్లా తనచేతికి వచ్చిందంటున్నాడు బాబాయ్?" కుర్చీ ఆయన దగ్గరగా లాక్కొని కూచున్నది రమాదేవి.

"ఎట్లా గేమిటి? తనదే నంటున్నాడు. ఆ నగ ఎక్కడ చేయించిందీ ఎప్పుడు చేయించిందీ ఆరా వచ్చింది. తను చెప్పలేనన్నాడు. అవసరం వచ్చి అమ్ముకుంటున్నా నన్నాడు."

నందకిశోరుని రామయ్యపంతు లెరుగును. అతను రమకన్న ఎనిమిదేళ్ళు పెద్ద. రమ తల్లిదండ్రులు అతనిని

చిన్నప్పటినించీ పెంచి పెద్దచేశారు. అతి చిన్న వయసులోనే సత్యాగ్రహోద్యమంలో యోధాను యోధుడుగా పేరెన్నికగన్నవాడు. బ్రిటిష్ గవర్నమెంటుకి అతనంటే హడలు. ప్రజలలో అతనికిగల పలుకుబడి అపారం. కొంత అతివాద ధోరణిలో కుర్రకారుతరాన్ని బలీయంగా ఆకర్షించుకొన్నవాడతను. ఇటీవల ఆగష్టు విప్లవంలో దౌర్జన్య చర్యలలో పాల్గొంటున్నాడనీ ఒక చిన్న ముఠాకు అధినాయకుడుగా ఈ ప్రాంతాలను కల్లోలపరుస్తున్నాడనీ కర్ణాకర్ణిగా విన్నాడు.

రాజేంద్రుడి సంబంధం చూచుకోవడానికి వచ్చినప్పుడు రమ తండ్రితోపాటు అతనూ వచ్చాడు. వివాహం నిశ్చయమయ్యే పర్యంతమూ అతనే పూనుకుని, ఒకటికి రెండుసార్లు తిరిగి, అన్నివిధాలా అవలంబించతగిన సంబంధమని రమ తండ్రికి గట్టిగా నచ్చచెప్పి ఖాయపరిచీ అన్నివిధాలా సమర్థుడు, యోగ్యుడు, అనిపించుకున్నవాడు. అతనికీ రమకీ పెళ్ళిప్రస్తావన జరిగినట్లు సూచనగా అనుకోవడం జరిగింది కాని, వాళ్ళిద్దరికీ ఎందుకు ముడిపడలేదో మాత్రం తెలిసిరాలేదు. ఎవరూ అంత పట్టించుకోనూ లేదు.

రమ తండ్రికి మటుకు అతను ఎంతో చేదోడు వాదోడుగా ఉండేవాడనీ అతను మొట్టమొదటిసారి ఇల్లువిడిచి జైలుపాలయిననాడు, ఆయన విపరీతంగా బెంగపెట్టుకొని నెల్లాళ్ళు మంచం పట్టాడని విన్నాడు కూడా.

రాజేంద్రుడు పోలీసుస్టేషనునించీ తిరిగివచ్చాడు. వచ్చి డ్రెస్సింగు రూమ్‌లో బట్టలు మార్చుకుంటున్నాడు. రమ తబిశీలుగా అడుగుతున్నది.

"నెక్‌లెస్ మనదేను." అన్నాడు ముభావంగా.

"అని చెప్పారా పోలీసులతో?"

"చెప్పక?"

క్షణం తీక్ష్ణంగా చూచాడామె వంక.

"అతను మనకు బంధువు అని పోలీసులకి తెలుసునా?"

"తెలీదనే అనుకుంటాను."

"ఈమధ్య టెలిగ్రాఫ్ తీగలు తెంపనూ, రైలు పట్టాలు పీకివేయనూ, పోలీస్‌స్టేషన్లు తగలబెట్టనూ లాంటి ఉద్యమంలో అతను చురుకుగా పనిచేస్తున్నాడనీ, పోలీసులతనికోసం గాలిస్తున్నారనీ పుకారుగా వున్నది."

"అట్లాగా? నేనుమాత్రం చెప్పలేదు అతను ఫలానా అని."

"అతనేమంటాడు మరి?"

"నగలు పెట్టుకునేది ఆడంగులు కదండీ, మగవాళ్ళు ఏమి గుర్తించగలరు? ఆ ఇల్లాలినే గుర్తించమనండి—ఆమె ఈ నగ తనదే అన్నట్టయితే మా ఇష్టము వచ్చిన చర్య తీసుకోండి నామీద. అంటున్నాడతను—తమాషాగా వుంది కదూ."

ఒక చిన్న నవ్వు నవ్వాడు రాజేంద్రుడు. ఆ నవ్వులో రమకి భయంకరమైన అర్థమేదో స్ఫురించింది.

"నగ ఇక్కడికి వస్తుందిప్పుడు. చూడు." అని హడావుడిగా కోర్టుకి వెళ్ళిపోయాడు రాజేంద్రుడు.

'లంచ్‌టయిము' – బార్‌రూములో పిచ్చాపాటీ అయింతరవాత రాజేంద్రుడు బైటికివస్తున్నాడు. రామయ్యపంతులు అవుపించాడు. రాజేన్ ప్రశ్నార్థకంగా చూశాడు. పంతులు ఆగి అతి జాగ్రత్తగా మాట్లాడుతున్న ధోరణిలో

"వినున్నది ... అమ్మాయి ... నెక్‌లెస్ తనది కాదు అంటున్నది."

దిమ్మెరపోయాడు రాజేన్.

"మనకి ఆ నగచేపి ఇచ్చిన రతన్‌లాలూ, మన రవణమ్మా అది మన నెక్‌లెస్సేను అంటున్నారు."

తల గోక్కున్నాడు రామయ్య తనకీ ఆ సమస్య కొరుకుబడనట్టు.

"రమని మీరు కదిపి చూశారా?" అని అడిగాడు రాజేన్. రామయ్యపంతులు అట్లా వదిలేసి ఊరుకోడని తెలుసు రాజేంద్రుడికి.

"ఆ...ఆ...అదీ అయింది ... కాని ససేమిరా అది మనది కాదు అంటున్నది...అంటే అననీండి కాని, అందులో ఒక చిక్కున్నది."

"ఏమిటి?"

"అన్నివిధాలా 'ఆ నగ మనదీ' అని సాక్ష్యాలు చుట్టూ మూగివుంటే 'కాదూ' అని అమ్మాయిమాత్రం మొరాయించడంలో వున్న అంతరార్థమేమిటా అన్న మీమాంసలో పడుతున్నారు పోలీసులు." అన్నాడు పంతులు.

"నాన్సెన్స్... అది మనదికాదు ... అంచాత కాదూ అంటున్నాం...అంతే...నగను పోలిన నగ

వుండడా? అ నగని రూఢిగా పోల్చగలిగేది రమే... వాళ్ళ ఇష్టంవచ్చినట్టు చేసుకోమనండి."

దురుసుగా వెళ్ళిపోయాడు రాజేన్.

వరసగా మూడు నాలుగు రోజులు ఒక ముఖ్యమైన హత్యకేసులో రాజేంద్రుడు కోర్టుకి పెందరాళే వెళ్ళడం, చాలా ఆలస్యంగా ఇంటికి రావడం, అతి జరుగుర ప్రయాణాలు చెయ్యడం సాగించాడు. అతనూ, రమా స్తిమితంగా ప్రసంగించుకుందుకు ఆస్కారమే లేకపోయింది.

*　　*　　*　　*

స్రాతపని ముగించుకుని తలగుడ్డ చుట్టుకుని వెళ్ళిపోతున్న రామయ్యపంతులు అధార్తుగా ఆగిపోయాడు.

"మీతో మాట్లాడాలండీ" అన్నాడు రాజేన్; ఎంతో ఆంతరంగికంగా మోగిన య్యా మాటలు. వచ్చి టేబిలుపక్కని బెంచీమీద కూచున్నాడు పంతులు.

"తలుపువేసి వస్తారా?"

పంతులి కాశ్చర్యమయింది...ఇంట్లో ఎవరున్నారనీ...వంటమనిషి ఆవేళ రానేలేదు. రమాదేవి చటుక్కున వచ్చినా రావచ్చును. రామయ్యకి అర్థమయింది. తలుపు గడియవేసి తాపీగా వచ్చి కూచున్నాడు.

"విన్నారా 'బార్'లో పుకార్లు?"

రామయ్య మౌనంగా ఊరుకున్నాడు.

"నా రమ శీలాన్ని శంకించేవరకూ పోతున్నాయి పోలీసు దర్యాప్తులు."

"శివ శివా!"

మళ్ళీ నిశ్శబ్దం ఆవరించింది.

"కాని చూడు నాయనా, మన నగ పోయినతీరు వాళ్ళకి వర్ణించి చెప్పడం కొంత కష్టంగానే ఉన్నది. చెప్పద్దూ?" అని నసిగాడు పంతులు.

"అసందర్భ మేమున్నది?"

"పట్టపగలు, ఒకడు, గదిలోకి ఎట్లా ప్రవేశించాడో తెలియని సందర్భంలో, మనిషిని నోరునొక్కి, గంతలుకట్టి మెడలోఉన్న నగను తెగిపోకుండా లాఘవంగా తొలిగించి, తానెవరో గుర్తయినా తెలియని విధంగా పారిపోయాడనికదా మనం చెబుతున్నది."

"కాని రమ అట్లాగే జరిగింది అంటున్నది."

"అది నిజమే...కాని వాళ్లు వేస్తున్నవి యక్షప్రశ్నలు."

"ఏమిటా ప్రశ్నలు."

"ఆవేళ ముడివేసుకున్నదా? జడవేసుకున్నదా?" మొదటి ప్రశ్న.

"జడే వేసుకున్నానని చెప్పింది కదా."

"అక్కడే వచ్చింది చిక్కు...మరి నెక్‌లెస్ ఎందుకు తెగలేదూ, అంటాడు సబిన్స్పెక్టర్."

"వాళ్ళ శ్రాద్ధం...కొక్కెంతీసి జార్చి పారేశాడేమో."

"రమ అట్లా అనలేదు. శిరస్సుమీదనించీ జడ క్రిందుగా జార్చి నెక్‌లెస్ కాజేశాడంటుంది. మరి అది తెగుతుందనీ, మెడ ఒరుసుకుంటుందనీ, వాడి కంత భయం దేనికీ అని ఒక చొప్పదంటు ప్రశ్న."

"ఏడిసినట్టుంది... నేర్పుగా తియ్యగలవాళ్లనే దొంగలు అంటాము మనం...ఈ వాజమ్మలు తియ్యలేక పోవచ్చును."

నోరు మూసుకున్నాడు పంతులు.

ఊరుకున్నవాడల్లా, ఉన్నట్టుండి, ఒక ప్రమాదాన్ని బైటపెట్టనూ పెట్టాడు.

"ఈ ప్రశ్నలకేమిగాని బాబూ పోలీసులు ఒక ప్రమాదకరమైనదారి తొక్కుతున్నారు."

"ఏమిటది?"

"మన రవణమ్మ చాత ఆ నాటిరాత్రి నందకిశోర్ మన ఇంట్లో వున్నాడని అనిపించబోతున్నారు."

"అట్లా అనిపించబోతున్నారా, అది అట్లా అంటున్నదా?"

"అది ఏమారివున్నప్పుడు చటుక్కున అనేసిన మాట నిజం...ఇక పట్టుకున్నారు వాళ్లు."

"దాని నోరు మూయించండి ముందు."

లేచాడు రాజేన్.

"అది తేలికగా నోరు మూసేలా లేదు. 'నేనెందుకు అబద్ధం చెప్పాలీ' అంటున్నది."

"ఆ!"

"అవును."

రామయ్యపంతులూ లేచాడు.

"దాని నోరు మూయించం డంతే." అన్నాడు రాజేన్—ఈసారి నిశ్చిత కంఠంతో. చిన్న దగ్గు దగ్గాడు పంతులు- "ఎట్లాగూ?" అన్నట్టు.

"ఎట్లాగయినా సరే." అని సాభిప్రాయంగా పంతులువంక చూచాడు రాజేన్—కంఠస్వరం తగ్గించి.

పంతులు కర్థమయింది.

"సరే."

తలపాగా చుట్టుకొని చరచర వెళ్ళిపోయాడు పంతులు. వెడుతున్నవాడల్లా వెనక్కి తిరిగివచ్చి వస్తా

యిస్తూ "పోనీ అమ్మాయితో ఒకసారి మాట్లాడరాదు బాబూ?" ఎదురుచూస్తో నిలబడ్డాడు.

రాజేంద్రుడు నవ్వుతూ "ఏమని అడగనూ?" అని పైకి చక్కాబోయాడు.

అప్పుడు ఆ ఘడియలో అంత సుఖంగా రాజేంద్రుడు నవ్వగలడని పంతులు అనుకోలేదు. హఠాత్తుగా గుండెలో ఏదో కలుక్కుమనీ అన్నది.

సాయంత్రం రమాదేవి గీతాభవనంలో సంకీర్తన కాగానే తిరిగి వచ్చింది. గబగబ మేడమెట్లెక్కి గదిలో కలయచూచింది. రాజేన్ కనిపించలేదు. స్టాండ్ మీద 'యూనివర్సిటీ'బూట్లూ, హ్యాంగర్ మీద ఆ వేళ వేసుకున్న సిల్కుషర్టూ ఉన్నాయి. 'కోర్టు నించీ వచ్చేసిఉండాల్నే' అనుకున్నది. క్రిందికి దిగి రవణమ్మని అడిగింది.

"వచ్చారమ్మా... మేడ గదిలో నే వుండాలిమరి."

"వెతికాను. అక్కడ లేరు."

"మళ్ళీ ఒకసారి చూడండి."

చరచర పైకివెళ్ళింది రమ. పిట్టగోడ చివర, కాడమల్లి చెట్టునీడని, ముడుచుకుని కూచున్నాడు రాజేంద్రుడు. పిట్టగోడమీద టర్కీ తువాలు వేసి వున్నది. దానిమీద గడ్డం ఆనించి సిమెంటు అరుగు మీద బాసీపెట్టు వేసుకుని, అరగన్ను పెట్టి, దీర్ఘాలోచనలో వున్నాడు. రమ ఉలిక్కిపడింది. ఇందాక తను రావడమూ, మేడగదిలోకి వెళ్ళి 'ఏమండీ' అని పిలిచి అతనికోసం వెతికి మేడ దిగిపోవడమూ, అన్నీ అతనికి తెలిసిఉండాల్నే—ఆమె గుండె ఝల్లుమన్నది—వెనకాలే వచ్చి భుజంమీద చెయివేసింది. ఉలిక్కిపడ్డాడు. అతన్ని పట్టుకొని నఖశిఖ పర్యంతమూ చూచింది. మాట్లాడడు. రెండు చేతులతోనూ కుదిపి "అట్లా చూస్తా రేమిటండీ?" అని గాబరాగా అరిచింది. దానితో ఈ ప్రపంచంలోకి వచ్చిపడ్డాడు రాజేన్.

"అబ్బే ఏమీలేదు. ఏమీలేదు ... అన్నట్టు రామయ్యపంతు లేడీ?" అని తడుముకున్నాడు అసందర్భంగా. అది అనవసర ప్రశ్న అని ఆమెకు తెలుసు. రామయ్యగారిని ఏదో ఊరికి పనిమీద పంపించింది రాజేంద్రుడే.

*   *   *   *

మర్నాడు నందకిశోర్ విడుదలయిపోయాడు. అంతవరకూ తను ప్రసాద్‌నని చెప్పుకున్నాడు పోలీసులతో.

*   *   *   *

ఆ సాయంత్రం ఏటిగట్టుకి షికారువెళ్ళాడు రాజేంద్రుడు. రామయ్యగారిని కూడా తీసుకువెళ్ళాడు. నీరెండ ఇసకలమీద మెరుస్తోంది. రాజేంద్రుడు రమ లేకుండా ఏనాడూ షికారు వెళ్ళడు. రామయ్యగారితో అస్సలు వెళ్ళడు.

"రండి. చుట్ట వెలిగించుకోండి. ఫరవాలేదు."

రామయ్య కాస్సేపు పస్తాయించి లంకపుగాకు పొయలు తీశాడు. ఎందుకు తనని కూడారమ్మన్నదీ ఆయనకి అవగాహనయ్యే వున్నది. అందుచేత, తనే ఉపక్రమించడం ఉచితంగా ఉంటుంది అనుకున్నాడు.

"బాబూ పోలీసు దర్యాప్తుల నిజాయితీ మీద అంత విశ్వాసమున్నదా మీకు?"

"నేను పోలీసు దర్యాప్తుని గురించికాదు ఆలోచిస్తున్నది...రమని గూర్చి."

కాస్సేపు ఊరుకున్నాడు రాజేన్ — ఇంకా లోతుగా అర్థంచేసుకుందుకు పంతులుకి కొంత వ్యవధి వదలాలని అతని ఊహ. రామయ్య పసికట్టాడు... సౌమ్యంగా అతని బుజం తడుతూ తొందరపడకు నాయనా...అంతా చీకటి గుయారంగా ఉన్నది... పరిస్థితులు కొంత వెలుగున పడితేనేగాని"...అని కొంత పస్తాయించి "చిన్నతల్లి రమలో కళంకాన్ని ఊహించుకోవడం పాపం సుమీ!" అని హెచ్చరించాడు.

నవ్వాడు రాజేంద్రుడు.

నవ్వి "అది సరే...నా బ్రతుకు ఇంత అప్రతిష్ఠపాలయిపోతున్నదని తెలిసిన్నీ..."

"అవును తెలుసుననే అనిపిస్తున్నది రమాదేవికి."

"అతని విడుదల అంత ముఖ్యమన్న మాట!" ఇద్దరూ మౌనంగానే తిరుగు మొహం పట్టారు.

ఇంటిదగ్గర రాజేంద్రుణ్ణి చూడగానే రమ గాబరాగా అడిగింది "ఎక్కడికి వెళ్ళారూ?" అని.

"పార్టీలు ఎవరైనా వచ్చారా?" అని అలవోకగా ప్రశ్నించి ఇంట్లోకి వెళ్ళిపోతున్నాడు రాజేంద్రుడు. తన ప్రశ్న తప్పిస్తున్నట్టు స్పష్టమయిందామెకి.

తలగడా గలేబులు మార్చేందుకు రమాదేవి మేడమీదకి వెళ్లింది. పని లేకపోయినా కింద హాలులోనే రాకింగ్ ఛెయిర్ లో కూలబడ్డాడు రాజేంద్రుడు. టేబిలుమీద అమిర్చిన కాంస్యపాత్రికమీద మొగలాయీ శిల్పం వెలవెలపోతోంది. అందులో క్రితం రోజు వుంచిన ఎర్రగన్నేరు పూలగుత్తి వాడిపోతోంది. మార్చమని రాజేన్ హెచ్చరించనేలేదు. రోజ్‌వుడ్ సోఫాసెట్టు ఖాళీగా వున్నది. రాజేన్ క్రిందనే వుండిపోయిన సంగతి రమాదేవికి తళుక్కున స్ఫురించింది. నాలుగైదు మెట్లుదిగి, క్రిందకి వంగి "ఇట్లా రండి." అన్నది. గంగిగోవులా వచ్చాడు. వచ్చి నిలబడ్డాడు. "కూచోండి." అన్నది—ఇంటికి వచ్చిన అతిథిని సత్క

రిస్తున్నట్టు కూచున్నాడు. నీడని పూలకుండీలోనించీ ప్రాకిన 'స్వీట్ మేరీ' తీగని 'ప్రూన్' చేస్తూ, సగంలో ఆగి, దగ్గరకువచ్చి తేరిచూచి బుజంమీద చెయివేసి:

"అట్లా వున్నారే?" అని అడిగింది.

కళ్ళల్లోకి చూచాడు.

"ఎట్లా వున్నాను?"

"భోంచేదామా?"

తల వూపాడు.

ఇద్దరికీ వడ్డన చెయ్యమని రవణమ్మని కేకేసి చెప్పింది.

కొబ్బరి ఈనెలలోనించీ చీలిన వెన్నెల పగిలిన అద్దం ముక్కలల్లే ఇద్దరిమీదా పడింది.

రాత్రి అతి పెందరాళే పైకి వెళ్లిపోయాడు రాజేన్.

పని ముగించుకుని రమ పైకి వెళ్ళింది. ఈదర గాలి వేస్తూంటే కిటికీలు మూయకుండానే పరున్నాడు రాజేన్.

"నిద్రపోతున్నారా?"

పలకరించింది రమ.

అతను కొంచెం కదిలాడు. కాని మాట్లాడడు. ఆమె అభిమానం గాయపడ్డది. దగ్గరికి వెళ్ళడానికి ఎన్నడూ లేని సంకోచమూ బెరుకూ పుట్టుకొచ్చినై. తనవేపు తిప్పివున్న అతని వీపువంక తదేకధ్యానంగా గడియ చూచింది. వేరే ఒక మంచంమీద మేను వాల్చింది.

ఇన్నాళ్ళూ నీవూ నేనూ అన్న విభాగ మెరగని ఆ కవమధ్య, ఆరాత్రి, అట్లా ఒక సన్నని ఉక్కు తెర వాలింది. రేడియోలో ఆఖరిప్రసారం మోగుతున్నది.

* * * *

రామయ్యపంతు లున్నది సొంతఇల్లేగాని పెద్ద లోగిలి కాదు. రాజేంద్రుడి మేడకి వెనకాల వీధిలోనే ఒక చిన్న పెంకుటిల్లు. ప్రొద్దున్న స్నానాదికాలు ముగించుకుని ధోవతి కట్టుకుని కంటిమెడ 'అఘారం' వేసుకుని, రాత్రి ఇంటికి తెచ్చుకున్న ఫైళ్ళు చంకన పెట్టుకుని బయలుదేరుతూంటే ఇంటిముందు చిన్న కారాగింది. ఎవరా అని సకౌతుకంగా తలెత్తి చూచాడు. రమాదేవి కారు దిగుతోంది. ఆమె తన ఇంటికి రావడమన్నది ఇంతవరకు జరగలేదు. ఆశ్చర్యమయిం దతనికి. చినిగిన తివాచీ ఒకటి బీరువా వెనక నించీ తీసి వసారాలో పరుస్తూ, లేని కుర్చీకోసం తెగ వెతుకుతున్నాడు. రమ కూచున్నది. భార్యని పిలవబోయాడు; వారించింది.

"మీతోనే మాట్లాడాలని వచ్చాను బాబాయ్. కాఫీ గట్రా అయింది. పిన్నిగారికి శ్రమ ఇవ్వవద్దు. కూచోండి." అన్నది. కిటికీదగ్గర చిరిచాపమీద కూచుని "ఇంటిదగ్గరనించేనా అమ్మా?" అని వినేందుకు సావధానంగా ఉద్యుక్తు డైనాడు.

ఆమె చెప్పుకుపోతోంది.

"ఇంతవరకూ కొంత తెలివితక్కువగానే మౌనం వహించి ఊరుకున్నాననుకోండి. ఇక అంతా స్పష్టంగా మీకు విడమరిచి చెబుదామని వచ్చాను బాబాయ్." అన్నది.

"చెప్పమ్మా చెప్పు."

"మీకు తెలుసునో తెలియదో నందకిశోర్ పూర్వ చరిత్ర కొంత మీకు వివరించడం అవసరమనిపిస్తున్నది."

"నాకు లీలగా తెలుసునుగాని..."

మాటలు మింగేశాడు పంతులు.

"నేను కలగక పూర్వం ఏనాడో మా నాన్న అతనిని తీసుకువచ్చి పెంచాడు. మద్రాసులో ట్రిప్లికేన్ బీచిలో జరిగిన ఉప్పుసత్యాగ్రహంలో లాఠీఛార్జికి గురై ప్రాణాలు విడిచిన ఒక దేశసేవిక ఏకైక సంతానమతను. ఆమె ఒక వితంతువు. దేశ విముక్తి కని తన జీవితాన్ని అంకితం చేసుకొన్న ఒక గొప్ప ఇల్లాలామె. కాని ఆమె కులగోత్రాలు మాత్రం భలానా అని తెలియవు మా నాన్నకు. మా నాన్న అతనిని స్కూల్ ఫైనల్ వరకే చదివించాడు. కాని అతను సొతహాగా చదివిన గ్రంథాలూ, ఆర్జించిన విజ్ఞానసంపదా అపారమయినవి. అతను గంభీరుడు; మితభాషి. అతన్ని తలుచుకుంటే హిమాలయాల ఔన్నత్యం జ్ఞాపకానికి వస్తుంది. అతని హృదయంలో సముద్రపు అగాధాలు దృగ్గోచర మవుతాయి.

"నా చదువు సంధ్యలు తప్పనిసరిగా అతనిపాల బడినై. నా ఊహలు, నా కోర్కెలు, నా ఆశలు, నా ఆశయాలు అతను మలిచాడు. అతనివాక్కు వేద వాక్కు నాకు. అతని ముందు మంత్రముగ్ధను నేను. అతను స్ఫురిస్తే, ఇప్పటికీ, ఈ సామాన్య ప్రజానీక మంతా చీమలబారల్లే అవుపిస్తుంది నాకు. అతని బలిష్ఠమైన కంఠం, విశాలమైన వక్షుస్సు, అజేయమైన ధీరత్వానికి చిహ్నాలుగా భావించేదాన్ని ఆనాడు. అట్లాంటివాడు, స్వదేశ దాస్యవిమోచన కని ఈనాడు దవానలంలా అలుముకున్న ఈ మంటలలో ఊరకకుండా ఎట్లా ఉండగలడు!

"నా హృదయమర్మాన్ని స్పష్టంగా విప్పిచెబదామని వచ్చాను బాబాయ్. అతన్ని ప్రేమించగల సాహసం అప్పట్లో నాకు లేదు. కాని అతనంటే గొప్ప ఆరాధన నాకు. వివాహం కాక క్రితం నాకు ప్రేమభావన అన్నది అంతగా లేదు. ఈ పుస్తకాలలోనూ, సినీమాలలోనూ, నడిచే ప్రణయదాహ మన్నది

నన్నంతగా సోకలేదప్పుడు. ఇక, ప్రేమ, అనురాగమూ ఇట్లాంటి చిల్లరభావాలకి ఇమిడే వ్యక్తిత్వం కాదు నందుడిది. ప్రేమించడం, ప్రేమలు అందుకోవడం, అతి - నేలబారు చవుకబారు కృత్యాలుగా పరిగణిస్తున్నట్టు మాట్లాడేవాడు.

"కాని తరవాత, తరవాత లీలగా తెలుసుకోగలిగాను. అతను నన్ను ప్రేమించాడు. నన్ను మలిచిన శిల్పి. నన్ను చూచి చలనం పొందాడు.

"నాన్నకి నేను ఏకైక సంతానం. నందకిశోరు తన మేనల్లుడనీ, వేలువిడిచిన ఒక పింతల్లి కూతురుకి కలిగిన ఒక్కగా నొక్క కొడుకనీ, చిన్నప్పుడే తల్లిదండ్రులు నష్టమైపోయిన కారణంగా తన పోష్యవర్గంలోకి తెచ్చుకున్నాననీ, నేను పుట్టేంతరువాత ఒక అభూతకల్పన ప్రచారంలోకి తెచ్చాడు మా నాన్న. ఇది అబద్ధమని నందుడికి తెలుసును గాని, నిజమేదో అతనికీ తెలియదు. మా నాన్నకి అతనంటే ప్రాణం. అతను మా నాన్నకు కుడిభుజం. వ్యవసాయపు పనులలోనేనా, ఇతరమైన లావాదేవీలలోనేనా, అతి లేత వయసులోనే కలిపించుకుని మా నాన్నకు రెండో శరీరంగా వ్యవహరించేవాడు. మా నాన్న చెప్పేంతరవాత అతను ఇంటిపని కలిపించుకోవడ మన్నది ఏనాడూ జరగలేదు; సాతహోగానే తెగబడి శ్రమించేవాడు; రాత్రులు తెగచదివేవాడు; పగలు రెక్కలు ముక్కలు చేసుకునేవాడు; ఊరు మోతుబరులలో ఒక మోతుబరై మంతనాలు సాగించేవాడు; గ్రామీణ రాజకీయాలలో సారథ్యం నెరపేవాడు; తీర్పులు తీర్చేవాడు; తెల్లవారక క్రితమే లేచి కాడికి చిరతలు బిగించి, ఎడ్లకి సికమోరద్దాలు బనాయించి చంద్రకోల పట్టుకొని...

'పదరా పదరా ముందుకు పదరా
భరతభూమి కెదురులేదు
భారతీయుడా ఓ భరత వీరుడా'

అని ఉచ్చైస్వరంలో పాడుకుంటూ ఏటిగట్టున రెండెడ్లబండీ ఛెళ్ళున తోలుకుపోతుంటే, కందిచేల గలగలలోనించీ దూసుకునివచ్చి వినిపించే దా పాట.

"మొదట్లో మా నాన్నా, మా అమ్మా, ఇరుగుపొరుగునా, మమ్మల్నిద్దరినీ కాబోయే దంపతులుగానే ఊహించుకున్నారు. కాని నందుడి పుట్టుపూర్వోత్తరాలు క్రమక్రమేణా చుట్టుపక్కల చాలామందికి తెలిసివచ్చినై. అయినా మా నాన్న చలించలేదు— తెగించదలుచుకున్నాడు కూడా—ఏమయితే అవుతుందనుకున్నాడు.

"కాని ఆయనసంకల్పం దెబ్బతిన్నది.

"రోజులు గడిచినకొద్ది నందకిశోర్‌లో పొటమరిస్తున్న సంచలనమూ, మామూలు గృహస్థులికి, సామాన్య ప్రజానీకానికీ అంతుబట్టని అతని ఆవేశపరంపరలూ, మా నాన్నదృష్టిని ఆకర్షించినై. అతనికి తెలియకుండానే అతని తల్లిదండ్రులు ఏనాడో అతనిలో అజ్ఞాతంగా వదిలి వెళ్ళిన విప్లవ సంప్రదాయపు నెరుసులు అప్పుడప్పుడు అతని కళ్ళల్లో కణకణ మండి ప్రజ్వలనం పొందేవి. మా అమ్మ మా నాన్నకన్న సూక్ష్మగ్రాహిణి. నందకిశోర్ ఎంత వేగంగా, ఎంత చురుకుగా, నన్నూ, నా మనస్తత్వాన్నీ తన ఆశయాల మూసలో గబగబ కరిగించి మార్చేస్తున్నాడో ఆమె పసిగట్టింది. అతని భారీ వ్యక్తిత్వపు నీడలో నా భవిష్యత్తు ఎట్లాంటి కంటకావృతమైన గహనమార్గాలు పట్టబోతున్నదో సులభంగా ఊహించుకొన్నది. జైలుకు వెళ్ళే సత్యాగ్రహుల్ని పుష్పమాలాంకృతుల్నిగా చెయ్యడంలోనూ, దేశభక్తుల్ని గొప్పగా ఊహించి వర్ణించడంలో నేను చూపుతున్న ఉద్రేకమూ, రాజకీయ ఉపన్యాసాలపట్ల నాకు దినదినమూ పెచ్చుపెరుగుతున్న ఔత్సుక్యమూ, ఇవన్నీ నన్ను పట్టిఇచ్చినై. 'నందకిశోర్ ఒక నిర్దిష్టమైన సాంసారిక చక్రంలో ఇమిడే మనస్తత్వం కలవాడు కాదు' అని తుది నిర్ణయానికి వచ్చారు వాళ్ళిద్దరూ. ఆ నిశ్చయంతో నా వివాహ ప్రయత్నాలు మా ఇంటి ఆవరణ దాటినై. 'నందూ – రమకి సంబంధాలు చూడాలి నాయనా. ఇప్పటికే ఎంతో తాత్సారం చేశాము.' అన్నాడొకనాడు మా నాన్న, కొంత స్వగతంగానూ కొంత ప్రసంగవైఖరినీ. చప్పున గ్రహించాడు నందు. నేను ఓరకంట కనిపెడుతున్నా, విషఘుటిక మ్రింగినట్టు విన్నాడా వార్త. కాని చలించలేదు.

* * * *

"అతనే గాలించి నాకు ఈ సంబంధం నిశ్చయించాడు. అది మొదలు గమనిస్తూ వచ్చాను–నందకిశోర్‌కి సత్యాగ్రహంపట్ల ఒడలెరుగని ఉత్సాహ ఉద్రేకాలు ఆవహించినై.

* * * *

"మొన్నటి విషాదసంఘటననాటి రాత్రి మా ఇంటికి ఆకస్మికంగా నందకిశోర్ వచ్చాడు. రాత్రి పది అయినట్టున్నది. ఊరంతా మాటుమణిగింది; జనార్దనస్వామి కోవెల గోపురం గూళ్ళలోనించీ పావురాళ్ళ కువకువలు చల్లని పిల్లగాలిమీద పయనాలు సాగిస్తున్నై. మా గదిలో రేడియో కలకత్తానించీ రాసలీల నృత్యాన్ని వినిపిస్తున్నది. 'రాజేంద్రుడేగా రిల్లి దేనా?' అని కింద ఎవరో అడుగుతున్నారు. నేను మేడమీద గదిలో ఉన్నదానినల్లా బైటికి వచ్చి పిట్టగోడ నానుకుని కిందికి చూచాను. నందకిశోర్ ముతక ఖద్దరుబట్టలు కట్టాడు. జుట్టు సంస్కారం లేక రాగి రంగు పడిపోయి

వున్నది. అతన్ని చూచి సుమారు మూడుసంవత్సరాలయివుంటుంది. అతను పైకి వచ్చాడు. నాకు జలజల కన్నీళ్లు రాలినై, అతని వాలకంచూచి. మా నాన్న అతని కోసం ఎంతో బెంగపెట్టుకున్నాడు. కాని అతను అన్నీ త్యజించి విరాగి అయిపోయినాడు. కూచోమన్నాను. కూచున్నాడు.

'ఎక్కణ్ణించి వచ్చావు నందూ?'

అతను ఖంగారుగా అటూ ఇటూ చూచాడు.

'రమా కుశలప్రశ్నల కేమిగాని, ఒక రహస్యం ముందు చెప్పాలి నీతో. నాకోసం పోలీసులు గాలిస్తున్నారు. నేను ఇక్కడికి వచ్చానని ఆచోకీ దొరికిందంటే నే నెట్లాగూ తుపాకీలకి గురిగాక తప్పదుగాని నీ ఉనికికి కూడా ప్రమాదం రావచ్చు. ఎట్లా?' అన్నాడు హడావుడిగా. ఎంత నిర్భయంగా వచ్చాడో! గబగబ కిటికీ తలుపులు మూశాను.

'భోజనం పైకి తీసుకురానా?'

'ఆకలిగానే వుంది మరి.'

గబగబ క్రిందనించీ కుంపటి తీసుకొచ్చాను. విసురుతో ప్రశ్నల పరంపర గుప్పించాను.

'ఎక్కడ వున్నావు నందూ? ఇన్నాళ్ళూ ఎక్కడెక్కడ తిరిగావు? ఎన్ని యుగా లయింది నిన్ను చూచి!' కళ్ళల్లో నీళ్లు మళ్ళీ గిర్రున తిరిగినై నాకు.

అతను గదంతా పరిశీలనగా చూస్తున్నాడు.

పెయింటు వేసిన 'సీలింగు' 'వైట్ షీడర్' నగిషీ బీరువాలూ, స్ప్రింగ్ కుషన్లతో మెరిసే సోఫాలూ - అద్దాలగోడబీరువాలలో తళతళమంటున్న వెండి సామాన్లు - 'స్టాండ్'మీద విడిచిన గ్వాలియర్ సిల్కు చీరలూ...ఆఖరికి టేబిల్ మీద తెరచిఉంచిన 'ముఖమల్ కేస్'లో నిగనిగలతో మిడిసిపడుతున్న నా రవల 'నెక్ లెస్' మీద అతని చూపు ఆగిపోయింది.

'చాలా ఐశ్వర్య ముందల్లే వున్నదే నీకు?' అని పరామర్శించాడు.

నాకు నవ్వు వచ్చింది.

'అరె...కళ్లు మిరిమిట్లుపోతున్నాయా నందూ? నువ్వు చూచిన సంబంధమే గదయ్యా...ఎంత వుందో తెలీకుండానే నిశ్చయించివచ్చావన్నమాట ... భలే.' అని ఛలోక్తిగా అన్నాను. అతను వినిపించుకోవడం లేదు. లేచి, ఒక్కొక్క సామగ్రీ, దగ్గరసా, పరిశీలనగా చూస్తో, ఘడీ ఘడీకి ఆశ్చర్యంలో మునిగి తేలుతో ఉన్నాడు.

'అవునుగాని నందూ నేను చాలా ధనవంతురాలినని తెలియనే తెలియదా నీకు.'

'తెలుసును గాని...'

నగలన్నీ పరీక్షగా చూస్తూ హడావుడిగా వున్నాడు.

'ఇంకా వున్నాయి...చూపిస్తాను రా.' అని ఇనప్పెట్టె తెరచి మామిడి పిందెలూ, కంఠమాలా, పాపిడి చేరూ అన్నీ చూపించాను.

'హుం. ఎంత ఐశ్వర్యం పోగుచేసుకొని కూచున్నావు రమా!' అన్నాడు తాపీగా కూచుంటూ.

నాకు నవ్వు వచ్చింది.

'అయితే ఇవన్నీ అమ్మేసి పేదవాళ్ళకి సంతర్పణ చేదామంటావా? చెప్పు.'

'ఒక్క పూటకు చాలదు నీ ఆస్తి అంతా.'

'మరింకెట్లా? నిట్టూర్పులు కాస్సేపు ఆపుజెయ్యవయ్యా మహాత్మా.'

అతనికీ నవ్వాగలేదు. ఆ నవ్వులో ఎంత బాధనయినా దిగమ్రింగగల క్షమాశక్తీ, స్వార్థచ్ఛాయలులేని నైర్మల్యం తళుక్కున మెరిశాయి.

'నువ్వన్నదీ నిజమే రమా...బాధపడినంత మాత్రాన బాధ తీసివేయలేము...దారిద్ర్యం ముళ్ళకంపలాంటిది. రెమ్మలు విరిచి లాభంలేదు. పిల్లవేళ్ళు పెకలించి లాభంలేదు. తల్లి వేరుమీద దెబ్బ తగలాలి. ఈ బానిసత్వమే ఈ దేశదారిద్ర్యానికి మూలకందం.'

'ఇదిగో పూనుకున్నావుగా యోధుడివి! తెల్లవాళ్ళు పరుగుచ్చుకుంటూ రిహాను.'

'కాని తరమాలి...వెనక్కి తిరిగిచూడకుండా తరమాలి...గుక్క తిప్పుకోకుండా తరమాలి...తరిమితేనేగాని...'

అర్థోక్తిలో ఎందుకో ఆగిపోయాడు.

అసలు విషయానికి వచ్చేస్తున్నాడు అనుకున్నాను.

'ఆ సందర్భంలో నే వచ్చాను రమా.' అన్నాడు కొంత లౌక్యంగా. టేబిలుమీద వున్న పెన్సిలుతో అరచేతిలో ఏమేమో వ్రాసుకుంటున్నాడు.

'చెప్పరాదూ?' అన్నాను టీ అందిస్తూ. చప్పరిస్తూ అటూ ఇటూ చూచాడు.

'అరె - అన్నీ నాకేనా?' అని కొన్ని బజ్జీలు నావేపు నెడుతూ, 'ఈ నెక్లెస్ ఎంతన్నావూ?' అన్నాడు యథాలాపంగా. నేను బజ్జీ ఒకటి తుంపుతూ,

'ఇంతని నేను చెప్పందే?'

'పోనీ ఇప్పుడు చెప్పరాదూ.'

'నాలుగు వేలు.'

'నాలుగు వేలే!'

చేతిలో సాసరుండిపోయింది గాని లేకపోతే గుండె బాదుకునేవాణ్ణే. దాని బరువు చేత్తో అంచనా

వేసుకున్నాడల్లే వుంది. అతని వేళ్లు ఆ నెక్‌లెస్‌తో ఆడుకుంటున్నాయి.

'ఇది నాకు కావాలి' అన్నాడు అధార్టుగా.

నేను ఓరకంట చూస్తూ, 'తీసుకో' అన్నాను అంత హటాత్తుగానూ...నాకు ఆలోచించ బుద్ధికా లేదు.

'వేళాకోళ మనుకుంటున్నావా?'

'దేనికయ్యా అలా కంగిస్తావూ?' అన్నాను నిర్లక్ష్యంగా.

'ఎందుకు నీకూ?' అని అడగ వెందుచేతా?

'చెబతావుగా - చెప్పకూడనిది కాకపోతే-'

'ఒక ముఖ్యమైన పనిమీద నీదగ్గరకు వచ్చాను రమా.' ఇక తాపీగా వివరిస్తున్నాడు.

'నా పరిస్థితి విను - ఒక ఇరవై మంది అనుచరులతో రహస్యంగా ఒక కుగ్రామంలో ఉంటున్నా నిప్పుడు. పోలీసులు మమ్మల్ని వెంటాడుతున్నారు. ఎందుకూ అని అడగకు. అదొక పెద్ద గాథ. ఇప్పట్లో ఆ గుప్తస్థలంనించీ కదలగూడదు. కాని వీళ్ళందరినీ పోషించే దెట్లా? పల్లెప్రజలు సాయపడతారు. కాని వాళ్ళ సహాయసంపత్తిమీద ఎక్కువగా ఆధారపడితే కొన్ని చిక్కులున్నాయి. ఆ నోటా ఆ నోటా పాకి మా ఉనికి బట్టబయలు కావచ్చు. వాళ్ళూ చిక్కున పడతారు. చాలినంత పైక ముంటే ఎవరి ప్రసక్తీ లేకుండా గుంభనగా ఈ అజ్ఞాతవాసం నడుపుకుందుకు సాధ్యమవుతుంది. ఇప్పుడు దొరికిపోయామా తుపాకీల కెరగాక తప్పదు. నా మాట ఎట్లావున్నా నామూలాన నా అనుచరులకూ తప్పదు.'

"నాకు నోటమాట రాలేదు. ఎంత సులభంగా చెప్పకుపోతున్నాడో!

'ఏమి టాలోచిస్తున్నావు?... సరే అఖ్ఖర్లేదులే.' లేవబోతున్నాడు.

చప్పున అటకాయిస్తూ 'అరె ... తీసుకోమంటుంటే ఏమిటా మొరాయింపు?' అన్నాను ధైర్యంగా.

'చాలా తెగించేస్తున్నావే? రాజేన్ మహారాజులుంగారికి ఏమని సంజాయిషీ ఇద్దామనుకుంటున్నావు?' కొంటెగా అడిగాడు.

'జరిగిన సంగతే చెప్తాను. అసత్య మెందుకు చెప్పాలీ?' నవ్వాడు.

'నువ్వు ఇట్లా అంటావని నాకు తెలుసు రమా - కాని, విని ఊరుకుంటాడా?'

'తిడతారు... నానా మాటలూ అంటారు ... కాదంటే కొడతారు...మారి దేవుడు మేలుచేస్తే...'

'అంతటితో ఆగుతుందా అని?' అర్ధవంతంగా చూశాడు.

'తీవ్రమైన అనుమానానికి గురి అవుతాను అదేగా నీ ఊహ?'

'కరెక్ట్ - అదే ఆలోచిస్తున్నాను రమా - ఒక వేళ కొడతాడే అనుకో నిన్ను...ఆమాత్రం భరించ లేవా రమా?'

'ఓ - భరించగలను.'

'ఒకవేళ కొంచెం గట్టిగానే కొడతాడనుకో... కాస్త నెత్తురు వచ్చినా ఫరవాలేదు...ఏమంటావు?... ఆ బాధలో ఒక గొప్ప పరమార్థ ముంది రమా...ఆబాధా తీవ్రతలోనే తెరుచుకుంటాయిస్మీ ఈ బానిసదేశ ప్రజల విముక్తికి బంగారు తలుపులు...ఆ మహత్కార్యంలో భాగస్వామినివి కాబోతున్నావు నువు రమా.'

'నాకు నచ్చచెప్ప నఖ్ఖర్లేదు నువ్వు.' అన్నాను సీరియస్‌గా.

'అవును లెఖ్ఖచెయ్యవు. నాకు తెలుసు. నీకు అపారమైనదేశ భక్తి వున్నది...కాని అతని అనుమానానికి నిన్ను గురిచెయ్యలేను...నా మూలాన నీ భవిష్యత్తు నాశనమైనా కావచ్చు...నా కఖ్ఖర్లేదు.'

మళ్ళీ లేచిపోయేందుకు సిద్ధమయ్యాడు.

'ఆగు.' అన్నాను.

'నందూ ఇటు చూడు...నీప్రాణంకన్న నాగులు వేలు చేసే ఒక ముష్టి నగకి ఎక్కువ విలువ ఇస్తా ననుకుంటున్నావా?'

'అక్కడే పొరబడుతున్నావు రమా...' సీరియస్‌గా మొహం పెట్టా డతను.

'నే నొక అల్పుణ్ణి...గడ్డిపరక చెయ్యదు నా విలువ...నాకోసం పూచికపుల్ల త్యాగం చెయ్యవద్దు రమా.' గంభీరమైపోతున్నా డతను.

'ఆ విలవలూ అంచనాలూ నాకు వదులు నందూ.'

'నేను ఈ మహాయజ్ఞంలో ఒక గరికపోచను మాత్రమే.'

'ఆ గరికపోచ ఎండపొడని పడేవేళ కాస్త నీళ్లు చిలకనీ నన్ను. అంతే...ఆలోచించు...నువ్వు భయపడుతున్న ఏ ప్రమాదానికీ నేను గురికాకుండానే ఈ నగని వదులుకోగలను. ఒక పచ్చి అబద్ధం పలికితప్పించుకుంటాను సరేనా.'

అతని కర్థమయింది.

'ఈ లోకంలో నూటిగా వెడితే తల బొప్పి కడుతుంది కదూ...రమా...ఇహ నే నిక్కడ వుండడం ప్రమాదం.'

"వెళ్లిపోయాడు. నెక్‌లెస్ అతని జేబులోనే వుంది.

* * * *

“తరవాత నడిచిన గాథ నేను కలిపించినకట్టు కథ. ‘స్టౌ’ దేనికి వెలిగించానా అని రవణమ్మ పైకి వస్తే చూచింది.”

“అదీ కథ.” అన్నాడు రామయ్యపంతులు.

“ఆనాటి రాత్రి నందకిశోర్ ని మనఇంట్లో చూచినట్టు చెప్పవద్దని అయిదువంద లిచ్చాము దానికి.” అని బైటపెట్టగానే రమ విస్తుపోయింది.

“జరిగిన సంఘటనలు యథాతథంగా చిత్రించాను మీకు...కాని ఒకటి స్పష్టంగా చెప్పాలి మీకు. నేను ఏనాడు నా ఇల్లువిడిచి ఈ గడ్డమీద అడుగు పెట్టానో, ఆనాడే నా భర్త పాదాలమీద జీవితాన్ని ఒక పూజా పుష్పంగా సమర్పించుకున్నాను. ఆనాడే నా చిన్ననాటి తలపులు, మమత్వాలు, ఆకాంక్షలు, అన్నీ ఉపనదులుగా మారి ఏకమైన మా యీ జీవిత ప్రవాహంలో కలిసిపోయినై. ఆనాడే ఒక బానిసదేశం విముక్తికి, ఒక అంధలోక సముద్ధరణకి, ఒక మహదాశయం వంకకి, ఒక మహా నావికుడి ఆధిపత్యాన పయనమైంది అనుకొన్న నా జీవితనౌక ప్రశాంతమైన ఈ రేవులో లంగరు వేసుకొన్నది. ఆ ముహూర్తంలోనే నందకిశోర్ తన రంగు రంగుల ఇంద్రజాలంతో సహా నా జీవితంలో ఎట్లా అడుగుపెట్టాడో అట్లానే అదృశ్యమైపోయాడు అనుకున్నాను. కాని అట్లా అంతర్హితుడు కాలేదు. అతని మూర్తి నా అంతరాత్మ అట్టడుగు పొరలలో, నాకే తెలియని అగాధాలలో, ఒక చిన్న దేవాలయం కట్టుకొని నక్కివున్న సంగతి మొన్న అతను హఠాత్తుగా అవుపించినప్పుడు గాని గ్రాహ్యం కాలేదు నాకు. మొన్నటివరకూ నేను నా భర్త జీవితంతో సర్వాత్మనా ఐక్యం పొందివున్న ఒక గృహిణిని; మొన్నటిదాకా నా రాజేన్‌కి రుచించని చర్య ఒకటి నాకు సాధ్యమవుతుందనీ, నా రాజేన్ మనస్సు ఇట్లా నొప్పించే పరిస్థితిని కల్పించగల సాహసం నాకు వస్తుందనీ, కలనైనా అనుకోలేదు. నా కోరిక అనీ, నా ఆశయమనీ, నా ఇష్టమనీ, ఒక ప్రత్యేకమైన వాంఛ అంటూ ఒకటి ఈ రమలో మిగిలివున్నదని మొన్నటిదాకా అనుకోనేలేదు నేను. ఆయన కేమి కావాలి, ఆయన కేమి రుచిస్తుంది, ఆయన కేది హితంగా వుంటుంది, అన్న మీమాంస తప్ప నాకేమి కావాలి, నా కర్తవ్య మేమిటి, అన్న దృక్పథంనించీ శాశ్వతంగా ఏనాడో విడిపడ్డానని అనుకున్నాను.

“కాని నందకిశోర్ మళ్ళీ అవుపించగానే తొల్లిటి రమ నాలో మేల్కొన్నది. అతను కనిపించగానే నా చిన్ననాటి సంస్కారబలం బైటికి చరచరా నడిచి వచ్చి అతనికి స్వాగతమిచ్చి చేతులుకట్టుకొని అతని ఆజ్ఞలకి సిద్ధంగా నిల్చుండిపోయింది. అతను మళ్ళీ నా జీవితంలో ప్రవేశించాడా అనిపించింది. అతను పలికిన వీరగాథలు విని ఉత్తేజం పొందిననాటి గడియలు, బలీయమైన అతని ఉపదేశ వాక్కులకింద పదునెక్కిన రక్తధార లేవో, ఆ క్షణం చటుక్కున ఆవేశించి నన్ను ముంచి వేరుచేశాయి. ఏమి చెయ్యను! ఆ క్షణంలో నా బాగోగులు నేను క్షుణ్ణంగా ఆలోచించుకోగల శక్తి కోలుపోయాను. నేను చేసిన సాహసంలో నా భర్త హృదయాంతరాళంలో ఉప్పెనలాంటి ఒకానొక సంశయభావాన్ని ఉవ్వెత్తున రేకెత్తిస్తున్నానని నాకు తెలుసును. ఆవిషబిందువుకి విరుగుడు నాచేతిలో లేదనీ నాకు తెలుసు. ప్రాణప్రదుడైన నా భర్త ప్రతిష్ఠకి ఒక పెద్ద ఆఘాతం తగులుతున్నదనీ నాకు తెలుసు. కాని ఇవన్నీ అతి పేలవమైన, అముఖ్యమైన, క్షుద్రమైన స్వార్థచ్ఛాయల కింద పరిగణనకి వచ్చినయ్యప్పుడు. ఈ స్వాతంత్ర్య మహోద్యమంలో, ఈ అగ్నిగుండంలో ఎట్లానూ దూకనేలేకపోయాను నేను. కాని అందులో సంపూర్ణంగా ఆహుతి అవుతున్న ఒకానొక దివ్య సుగంధపుష్పంమీద రెండు పన్నీటిచినుకులు చిలకడంకన్న సార్థక్య మేమున్నది అనిపించింది.

“తెగించి చట్టన స్వతంత్రించాను. ఈ క్షణంలో నేను మామూలు రమనే.” అని ఆగింది.

రామయ్యకి కన్నీళ్ళాగలేదు. గొంతుక సవరించుకుని “అమ్మా ఆవేశపడకు...నువ్వేమీ తప్పుచెయ్యలేదు. అంతేకాదు - నేనూ, రాజేన్, రాజేన్ తరంవాళ్ళంతా హర్షించదగిన మహత్కార్యం చేశావు నువ్వు- అయ్యయ్యో పిచ్చితల్లీ ...రాజుబాబు ఎంత ఉదారుడు! ఎందుకు చెప్పలేదమ్మా ఇదంతా రాజేన్‌కి.”

“మీకు చెప్పినంత స్తిమితంగా ఆయనకి చెప్పలేను బాబాయ్...దానికీ ఒక కారణ మున్నది. ఆయన దృక్పథం విశాలమయిందేను..చిలిపి చిలిపిగా అనూయా గ్రస్తమైపోయే మన స్తత్వం కాదాయనది. మొదట్లో నందకిశోర్ ని గూర్చి నేను గొప్పగా ఊహిస్తున్నవయినం చిన్న చిన్న ప్రసంగాలలో పసిగట్టా రాయన. అతని గొప్పతనాన్ని, ఆయన అసందిగ్ధంగా అంగీకరించిన ఘట్టాలు కూడా వున్నాయి. కాని ఒక రహస్య ముంది

బాబాయ్...ఆయనకి సేనంటే పంచప్రాణాలు. నా మమతలు, నా అపేక్షలు, ఛాయామాత్రంగానైనా ఒక రితో పంచుకోలేదు నా రాజేన్. నామీద ఆయన కున్న అనురాగ మంత సున్నిత మయినది, అంత గాఢ మయినది అని క్రమక్రమేణా నాకే తెలిసివచ్చింది. అనురాగపూర్ణ మయిన నా రాజేణ్ హృదయంలో నాకే తెలియని చిన్న చిన్న గాయాలు చేస్తున్నానని గ్రహింపుకి రాగానే నందకిశోర్ ప్రసక్తి పూర్తిగా తుంచివేశాను. కాని హఠాత్తుగా సేను తీసుకున్న ఈ జాగ్రత్తలో ఆయన అనుమానం అదృశ్య మయిందో, ఇంకా బలం పుంజుకొన్నదో సేను చెప్పలేను.

"ఇక ప్రస్తుతానికి వస్తాను. చివరకి సేను చిక్కుకున్న విషజాలంలోనించి బైటపడలేని పరిస్థితికి వచ్చాను బాబాయ్. నరకయాతన పడుతున్నాను. మేమిద్దరమూ ఇప్పుడు మాట్లాడుకోవడం లేదు. అదీ పరిస్థితి."

"ఆ!"

"అవును బాబాయ్. ఆయన ముభావమూ, నిస్తేజమైన చూపూ నాకు భయోత్పాతంగా వున్నాయి. ఏమో ఊహించుకుంటున్నా రాయన. ఏనాడు ఆయన జీవితంలో భాగస్వామినిగా ఇక్కడ అడుగుపెట్టానో ఆనాడే నా చిన్ననాటి అభిమానాలు, స్నేహముద్రలు అన్నిటినీ ఆయన కభిముఖంగా మలుచుకుని మనసా, వాచా, ఆయనతో ఐక్యంపొంది వున్నానని ఎట్లా నమ్మించగల నాయనని? ఒడ లెరుగని ఏదో ఒక మోహవిభ్రాంతిలో ఆ నగని ధారాదత్తం చేశాను అనుకొంటున్నా రాయన. ఈ నాలుగు రోజులలోను నాలుగు యుగాలు దూరంగా జరిగిపోయాను సే నాయనకి. ఆయన చల్లనిచూపు, తియ్యని పలుకు కరువైనాయి నాకు. ఏదో అయోమయంలో పడిపోతున్నాను. నాకు మీరే రక్ష బాబాయ్."

"అట్లా అనకు తల్లీ...నువ్వు అనవసరంగా ఆందోళనపడుతున్నావు. నీకు వచ్చిన భయమేమీ లేదు. రా అమ్మా రా...నేను రాజుబాబుతో చెబుతాను - సవిస్తరంగా చెప్పగలను కూడా...నామాట మన్నించి తీరతాడు రాజేన్. నాకు తెలుసును. ఏమీ ఫరవా లేదు...ఈమాత్రం దానికి ఎంత అలజడికి గురిఅయ్యావు తల్లీ...నాలుగురోజులలో ఎంత చిక్కిపోయావమ్మా.. ఇప్పటికైనా నా చెవిని వేశావు...మంచిపని చేశావమ్మా...ఇందులో కొంత నా అపరాధం కూడా వున్నది స్మీ...ఇపుడు నువ్వు బైటపెట్టిన ఆరా లంతగా నాకు తెలియక, రాజుబాబు అపోహలో పడివున్నప్పుడు నేను చెప్పవలసినంతగాచెప్పి సర్దుబాటు చెయ్యలేకపోయాను. రా అమ్మ రా...నువ్వు తటస్థంగా ఉండంతే...నేను అంతా చక్కదిద్దేస్తాను. సరేనా తల్లీ!"

చెంపలమీద కన్నీళ్లు తుడుచుకున్నది రమ. చీకట్లో చంద్రోదయమయినట్లు ఆమె పెదిమలమీద చిన్న నవ్వు మెరిసింది.

కారు విసురుగా నడిపాడు డ్రైవరు. విడిన మధ్యాహ్నపు ఎండలో తూనీగలుతళుక్కుమంటున్నాయి.

రాజేన్ మేడగదిలో పరున్నాడల్లేవుంది. తలుపు వేసివున్నది. నిద్ర లేపడమా వద్దా అన్న మీమాంస పట్టుకున్నది ఇద్దరికీ..."ఏమండీ!" అని సన్నగా పిలిచింది రమ. ఒకవేళ ఏ మాగన్ను నిద్రలోనో వుంటే మెళుకువ రానేవస్తుందన్న దిలాసాలో.

యథాలాపంగా గది తలుపులమీద రామయ్యగారి చేయిపడింది. గబుక్కున తెరుచుకున్నాయి తలుపులు. లోపల గడియవేసిలేదు. లోపల అడుగుపెట్టగానే అంతా నెత్తురు మడుగైపోయి వున్నది. కళ్లు బయర్లు కమ్మ యిద్దరికీ. ఒక్క పొలికేక పెట్టాడు పంతులు. ఇద్దరూ గబగబ స్ప్రింగు మంచం దగ్గరికి పరిగెత్తారు. రాజేంద్రుడు నిశ్చలంగా నిద్రపోతున్నాడు. కుత్తుక నడిమిభాగంలో ఒక చిన్న రేజర్ బ్లేడు అంగుళం మేర దిగిపోయివున్నది.

మృత్యుదేవత అంత ప్రశాంతంగా, అంత ప్రచ్ఛన్నంగా, ఆ గదిలోకి జొరబడుతున్నదని ఎవ్వరూ అనుకోలేదు.

కెవ్వున కేకపెట్టి భర్త కళేబరంమీద అలాగే కుప్పగూలిపోయింది రమ.